క్లుప్తంగా

కులమత విద్వేషాలకు వ్యతిరేకంగా పోరాడాలి



నందిపేట్ (ఆర్మూర్): కులమత విద్వేషాలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాటం చేయాలని ప్రజాపంథా జిల్లా నాయకుడు గంగాధర్ అన్నారు. నందిపేటలో బుధవారం సీపీఐ ఎంఎల్, ప్రజాపంథా ఆధ్వర్యంలో సత్య శోధక్ సమాజ స్థాపన దినోత్సవ సభ నిర్వహించారు. జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలే కోరుకున్న సమాజం కొరకు పోరాడాలని పిలుపునిచ్చారు. నాయకులు మల్లన్న దేవన్న, స్వప్న, రజిత, రాజమణి, సుల్తానా, లత పాల్గొన్నారు

కొనసాగుతున్న రిలే దీక్షలు



బోధన్: పట్టణంలో ఎన్డీఎస్ఎల్ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం 54వ రోజు కొనసాగాయి. ఈసందర్భంగా ఫ్యాక్టరీ కార్మికులు మాట్లాడుతూ.. మూతపడిన నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని, బకాయి వేతనాలు అందించాలన్నారు. నాయకులు సీపీఎం డివిజన్ ప్రతినిధులు శంకర్‌గౌడ్, గంగాధర్, గంగాధరప్పా, కార్మికులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల నిరసన



బోధన్: తమ సమస్యలను పరిష్కరించాలని ఆశా వర్కర్లు డిమాండ్ చేస్తూ, పట్టణంలో నిరసన వ్యక్తం చేశారు. ఈమేరకు వారు పట్టణంలో చేపట్టిన సమ్మె బుధవారం మూడోరోజు కొనసాగింది. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆశా వర్కర్ల డిమాండ్లను నెరవేర్చాలన్నారు. మండలంలోని వివిధ గ్రామాల ఆశాలు, కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను గెలిపించాలి



బాల్కొండ: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని పార్టీ నాయకుడు ముత్యాల సునీల్‌రెడ్డి ప్రజలను కోరారు. మెండోరా మండలం దూదిగాం గ్రామంలో బుధవారం గుండె గుండెకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక



మోర్తాడ్/కమ్మర్‌పల్లి: మోర్తాడ్ మండల కేంద్రానికి చెందిన 30 మంది హిందూ సేన యూత్ సభ్యులు బుధవారం బీజేపీలో చేరారు. కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లిలో వారికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ ఏలేటి మల్లిఖార్జున్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. యూత్ సభ్యులు సాగర్, శివ, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

ఫసల్ బీమా అమలు చేయాలి



మోర్తాడ్: రైతులకు ప్రయోజనం కల్పించే ఫసల్ బీమా పథకంను ఎందుకు రాష్ట్రంలో అమలు చేయడం లేదని, వెంటనే ప్రభుత్వం అమలు చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు నూతుల శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మోర్తాడ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులపై సీఎం కేసీఆర్‌కు, మంత్రి ప్రశాంత్‌రెడ్డికి చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. ఫసల్ బీమా అమలు చేసి ఉంటే రైతులకు ఎంతో లాభం కలిగేదన్నారు. నాయకులు నరేష్, భోగ దేవేందర్, మురళీగౌడ్, ప్రకాష్, లక్ష్మి నర్సయ్య, అశోక్, శ్రీనివాస్, రాజేశ్వర్, గంగారెడ్డి పాల్గొన్నారు.

చేపల పెంపకాన్ని ప్రోత్సహించాలి

బాల్కొండ: చేపల పెంపకాన్ని ప్రోత్సహించాలని ఉదయ్ ఆక్వాకల్చర్ కంపెనీ ప్రతినిధి లక్ష్మీ అన్నారు. బాల్కొండలో మహిళ సమాఖ్య సభ్యులకు బుధవారం ఆమె అవగాహన కల్పించారు. మహిళ రైతు ఉత్పత్తిదారుల సంస్థ ద్వారా రైతులకు పొలాల్లో కొర్రమీను చేపల పెంపకంపై అవగాహన కల్పించాలన్నారు. ఏపీఎంలు గంగాధర్, ప్రసాద్‌రావు ఉన్నారు.

లక్ష్మణ్ బాపూజీ జీవితం ఆదర్శం

- రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- కమ్మర్‌పల్లిలో బాపూజీ విగ్రహావిష్కరణ



నందిపేటలో నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు



కమ్మర్‌పల్లిలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి వేముల

కమ్మర్‌పల్లి: తెలంగాణ మలి ఉద్యమానికి మొదటగా నీడనిచ్చిన ధీశాలీ ఆచార్య కొండాలక్ష్మణ్ బాపూజీ అని, ఆయన జీవితం ఆదర్శవంతమని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కమ్మర్‌పల్లిలో బుధవారం మండల పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాపూజీ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం సంఘ భవనంలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంతో కేసీఆర్, బాపూజీని విడదీయరాని బంధమని తెలిపారు. తనకు ఊహకందని విధంగా గౌరవించిన పద్మశాలీలను మరిచి పోనని, వారి భవితకు బాటలు వేసేందుకు సీఎం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. సీఎం కేసీఆర్ వచ్చే ఐదేళ్లలో ఉచిత విద్య, వైద్యంపైనే పాలన సాగించనున్నారని పేర్కొన్నారు. ఆర్మూర్ ఏసీపీ జగదీష చంద్ర, ఆర్‌డీఓ వినోద్‌కుమార్, డీసీసీబీ వైస్ చైర్మన్ రమేష్‌రెడ్డి, పద్మశాలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బిజూ దత్తాద్రి, ప్రధాన కార్యదర్శి పులగం హన్మాండ్లు, మండలాధ్యక్షుడు చింత తిరుపతి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రేగుంట దేవేందర్ పాల్గొన్నారు.

ఘనంగా జయంతి వేడుకలు..

నందిపేట్/మాక్లూర్/ఆర్మూర్‌టౌన్/నవీపేట/బాల్కొండ/రుద్రూర్: ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో బుధవారం స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బాపూజీ చిత్రపటం,



మాక్లూర్ మండల కేంద్రంలో..

విగ్రహాలకు పద్మశాలీలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు పూల మాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ.. ఆయన పోరాటాలు, సేవలను కొనియాడారు.



ఆర్మూర్‌లో..



కిసాన్‌నగర్‌లో..



బాల్కొండలో..

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కమ్మర్‌పల్లి/మోర్తాడ్(బాల్కొండ): మండల కేంద్రంతో పాటు, హాసకొత్తూర్‌లో పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. అలాగే మోర్తాడ్‌లో రూ.5కోట్లతో నిర్మించనున్న న్యాక్ సెంటర్‌కు మంత్రి శంకుస్థాపన నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. న్యాక్ సెంటర్‌లో నిరంతరం 90 మందికి వివిధ రంగాల్లో శిక్షణ ఇస్తారని వారికి విదేశాల్లో మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు. కొటపాటి నర్సింహానాయుడు, ఎంపీపీ శ్రీనివాస్, జెడ్పీటీసీ బద్దం రవి, సర్పంచ్ భోగ ధరణి, వైస్ ఎంపీపీ తొగటి శ్రీనివాస్, సర్పంచ్ ఏనుగు పద్మ, ఉప సర్పంచ్ రాజేశ్వర్, గడ్డం శ్రీధర్, ఎంపీటీసీ రజిత, నరేందర్‌రెడ్డి, కిరీటీ, రమేష్ పాల్గొన్నారు.



మోర్తాడ్‌లో న్యాక్ సెంటర్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

మాక్లూర్‌లో సొసైటీ మహాజన సభ

మాక్లూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరిపతి సంఘ భవనంలో బుధవారం కార్యదర్శి సంతోష్ అధ్యక్షతన సొసైటీ 82వ మహాజన సభ నిర్వహించారు. సంఘం అధ్యక్షురాలు గోపు లక్ష్మి సమావేశంలో పాల్గొని, మాట్లాడారు. రైతుల సేవలో ఉంటూ వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పని చేస్తున్నామన్నారు. అనంతరం రుణ మాఫీ అయిన రైతులకు చెక్కులను అందజేశారు. వైస్ చైర్మన్ మచ్చర్ల రమేష్, డైరెక్టర్లు అశోక్, గంగాధర్, మంజుల, ప్రసాద్, సర్పంచ్ అశోక్‌రావు, ఎంపీటీసీ వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

రెంజల్‌లో..

రెంజల్(బోధన్): రెంజల్, దూపల్లి గ్రామాల్లో బుధవారం సొసైటీ మహాజన సభలను నిర్వహించారు. విండోల పరిధిలోని ఆయా గ్రామాల రైతులు పాల్గొని, సభ దృష్టికి సమస్యలను తీసుకవచ్చారు. ప్రభుత్వం ప్రకటించిన రూ. లక్ష రుణమాఫీ ఇప్పటి వరకు ఎందరు రైతులకు వర్తించిందని, మిగిలిన రైతులకు ఎప్పటి వరకు మాఫీ వస్తుందని ప్రశ్నించారు. కార్యదర్శులు సొసైటీ ఆదాయవ్యయాలను వివరించారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ అందించాలని సభ్యులు తీర్మానించారు. చైర్మన్‌లు మొయినోద్దిన్, భూంరెడ్డి, సర్పంచ్‌లు మర్ల రమేశ్ కుమార్, సాయరెడ్డి ఉన్నారు.



మాక్లూర్‌లో మాట్లాడుతున్న గోపులక్ష్మి

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

వర్ని: సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వర్ని ఎస్సై కృష్ణ కుమార్ పేర్కొన్నారు. చందూరులోని ఓ ప్రయివేటు పాఠశాలలో బుధవారం ఆయన సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇతరులకు తమ సమాచారాన్ని అందించరాదని, ఓటీపీలు ఎవరికి చెప్పరాదన్నారు. గ్రామాల్లోకి కొత్త వ్యక్తులు వస్తే వారికి ఆశ్రయం కల్పించరాదని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను/డయల్ 100ను సంప్రదించాలన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

నవీపేట: కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకుడు సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రంలో బుధవారం ఆయన ఇంటింటికి కాంగ్రెస్ ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలతో అన్ని వర్గాల అభివృద్ధి ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. నాయకులు మానాల మోహన్‌రెడ్డి, తాహెర్, సుధాకర్‌రావ్, శ్రీనివాస్‌గౌడ్, రాజేంద్రకుమార్‌గౌడ్, సాయరెడ్డి, గోపాల్, భగవాన్, గోవర్ధన్‌రెడ్డి, కోటరెడ్డి, రవీందర్, మూస, బాబు, వడ్డెరవి పాల్గొన్నారు.



నవీపేటలో ప్రచారం నిర్వహిస్తున్న సుదర్శన్‌రెడ్డి

అంగన్‌వాడీల డిమాండ్లు నెరవేర్చాలి





రుద్రూర్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు.. బోధన్‌లో అంగన్‌వాడీల వంటా-వార్పు

ఆర్మూర్‌టౌన్/రుద్రూర్/బోధన్/కమ్మర్‌పల్లి/వేల్పూర్: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల డిమాండ్లను నెరవేర్చాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె బుధవారం 17వ రోజు కొనసాగింది. ఆర్మూర్‌లో అంగన్‌వాడీల సమ్మెకు రమేష్‌బాబు మద్దతు తెలిపారు. రుద్రూర్‌లో అంగన్‌వాడీ ఉద్యోగులు రాస్తారోకో నిర్వహించారు. బోధన్, కమ్మర్‌పల్లిలో అంగన్‌వాడీలు వంటా-వార్పు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. వేల్పూర్‌లో బోనాల ఊరేగింపుతో అంగన్‌వాడీలు నిరసన తెలిపారు.



వేల్పూర్‌లో బోనాలతో అంగన్‌వాడీ టీచర్లు

సంక్షిప్తం

విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు

డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని తొండాకూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం నందిపేట్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత దంతవైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. క్లబ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నియామకం

పెర్కిట్(ఆర్మూర్): పీఆర్టీయూ ఆర్మూర్ రూరల్ అధ్యక్షుడు ఇట్టం గోపాల్ జిల్లా క్రమ శిక్షణ కమిటి చైర్మన్‌గా నియమితులయ్యారు. జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్ బుధవారం గోపాల్‌కు నియామకపత్రాన్ని అందజేశారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని సాంఘీక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో ఇగ్నేట్ సంస్థ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం, నైపుణాభివృద్ధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంస్థ సభ్యులు రంజిత్‌చ శ్రీరామ్, అనిష్, సుధాకర్ ఉన్నారు.

మున్సిపల్ కార్మికులకు వైద్యశిబిరం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ ఉద్యోగులకు, కార్మికులకు వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించారు. మందులు అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వినీత, డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహన్ తదితరులున్నారు.

ముక్తార్ పాషా వర్ధంతి సభ

బోధన్: పట్టణంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో బుధవారం ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి, అమరుడు ముక్తార్ పాషా వర్ధంతి సభ నిర్వహించారు. ఈసందర్భంగా యూనియన్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఆయన చేసిన పోరాటాలను నాయకులు కొనియాడారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

బాల్కొండ: మండలంలోని కిసాన్‌నగర్‌లోని నచికేత ఆవాస విద్యార్థులకు బుధవారం మండల కేంద్రంలోని కౌటిల్య గణేష్ మండలి వారు నిత్యావసర సరుకులు, నగదు అందించారు. విద్యార్థుల సంక్షేమానికి తమవంతు సహకారం అందిస్తామన్నారు.

రుద్రూర్‌లో 'మేరీ మాటీ- మేరా దేశ్'

రుద్రూర్: రుద్రూర్‌లో మేరీ మాటీ- మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం బీజేపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి మట్టి సేకరించారు. ఢిల్లీలో ఏర్పాటు చేయనున్న అమరవీరుల స్మృతి వనం కోసం మట్టి సేకరణ చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. నాయకులు మాల్యాద్రిరెడ్డి, హరికృష్ణ ఉన్నారు.

విద్యాసామగ్రి వితరణ

మోర్తాడ్: మండలంలోని పాలెం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు కేంద్రీయ విద్యాలయం పీజీటీ ద్యావరిశెట్టి శ్రీనివాస్ విద్యా సామగ్రిని వితరణ చేశారు. బుధవారం వాటిని విద్యార్థులకు హెచ్‌ఎం పంపిణీ చేశారు.

జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

కమ్మర్‌పల్లి: అక్టోబర్ 8న బాల్కొండలో జరిగే జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు మండలంలోని బషీరాబాద్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం కనక గంగాధర్ తెలిపారు. మంగళవారం కమ్మర్‌పల్లిలో జరిగిన పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి అండర్-17, అండర్-14 విభాగంలో ఎంపికయ్యారని వివరించారు. బుధవారం విద్యార్థులను వారు అభినందించారు. అభినందించింది.

ఆర్థికసాయం అందజేత

వేల్పూర్: మండలంలోని పడగల్ గ్రామానికి చెందిన గడ్డం రక్షిత, భవ్యశ్రీ అనే అక్కాచెల్లెలు అనారోగ్యానికి గురవడంతో వైద్య చికిత్స కోసం బుధవారం కాంగ్రెస్ నాయకుడు ముత్యాల సునీల్‌కుమార్ రూ. 25వేల ఆర్థిక సహాయం అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నేడు పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్

వేల్పూర్: ప్రపంచ రేబీస్ డేను పురస్కరించుకొని పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గురువారం పెంపుడు కుక్కలకు ఉచిత రేబీస్ వ్యాక్సిన్ వేయనున్నట్లు మండల పశువైద్యాధికారి సంతోష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వేల్పూర్ పశువైద్యశాలలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వ్యాక్సిన్ వేస్తామన్నారు.

ఘనంగా గణనాథుల నిమజ్జనం





రుద్రూర్‌లో వినాయక నిమజ్జన శోభాయాత్ర.. చిక్కడపల్లి చెరువులో నిమజ్జనం చేస్తున్న యువకులు



బోధన్‌లో పూజలు నిర్వహిస్తున్న బీజేపీ నేతలు

సాక్షి నెట్‌వర్క్: ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ముగింపుదశకు చేరుకున్నాయి. ఈసందర్భంగా బుధవారం పలు మండలాల్లో వినాయకులను నిమజ్జనం చేశారు. అంతకుముందు వినాయక విగ్రహాలను మండపాల నుంచి ప్రత్యేక వాహనాల్లో ఏర్పాటు చేశారు. అనంతరం మండలి సభ్యులు, భక్తులు నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ, శోభాయాత్ర చేపట్టారు. నవరాత్రుల్లో పూజలందుకున్న వినాయకుడి లడ్డు ప్రసాదానికి వేలం నిర్వహించారు. అనంతరం గణనాథులను స్థానిక చెరువులు, కుంటల్లో భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. బోధన్‌లోని శ్రీ విష్ణు గణేష్ మండలి లడ్డును వేలంలో రూ.23,600లకు ముస్లిం వ్యక్తి మహబూబ్ ఖాన్ దక్కించుకున్నాడు. బోధన్, సాలూర మండలంలోని పలు గణేష్ మండపాల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు, ఎంపీఆర్ ఫౌండేషన్ చైర్మన్ మేడపాటి ప్రకాష్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాలూరలోని సార్వజనిక్ గణేష్ మండపం వద్ద ఎమ్మెల్యే షకీల్ అన్నప్రసాద వితరణ చేశారు.

గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి

బోధన్‌రూరల్(బోధన్): ప్రశాంత వాతావరణంలో ఆనందోత్సాహాలతో గణేష్ నిమజ్జనోత్సవం జరుపుకోవాలని బోధన్ గ్రామాభివృద్ధి, సార్వజనిక్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సింగం బాగారెడ్డి, శ్రీచక్రేశ్వర ఆలయం చైర్మన్ బీర్కూర్ శంకర్ (బుజ్జి) అన్నారు. నేడు(గురువారం) గణేష్ శోభాయాత్ర, నిమజ్జనం పురస్కరించుకుని ఏర్పాట్లపై బుధవారం పట్టణంలో వారు మీడియా సమావేశం నిర్వహించి, మాట్లాడారు. గణేష్ శోభాయాత్ర, నిమజ్జనోత్సవం సందర్భంగా అధికారుల సహకారంతో గ్రామాభివృద్ధి కమిటీ, సార్వజనిక్ ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేశామన్నారు. శ్రీచక్రేశ్వర ఆలయంలో ఏర్పాటు చేసిన సార్వజనిక్ గణేష్‌కు ప్రత్యేక పూజలు, లడ్డు వేలంపాట అనంతరం సాయంత్రం 4.15లకు శోభాయాత్ర మొదలవుతుందన్నారు. 5ఫీట్ల ఎత్తు గల గణేశులను పట్టణంలోని జూనియర్ కళాశాలలోని బావిలో నిమజ్జనం చేయాలని, 5ఫీట్ల కంటే ఎత్తు గల గణేశులను పట్టణ శివారులోని పసుపు వాగులో నిమజ్జనం చేయాలన్నారు. ప్రజలు పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయలన్నారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు కొంద్రు వెంకట్, జెల్ల నారాయణ, పూజరి లింగం, గుమ్ముల శంకర్ రెడ్డి, ప్రభు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సార్వజనిక్ ఉత్సవ కమిటీ సభ్యులు



కిసాన్‌తండాలో నృత్యాలు చేస్తున్న మహిళలు



సాలూరలో అన్నదానం



రాణాకలాన్‌లో..

పౌష్టికాహారం తప్పక తీసుకోవాలి

నందిపేట్: రాష్ట్ర ప్రభు త్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తప్పక తీసుకోవాలని రాష్ట్ర మహిళా సంక్షేమ అభివృద్ధి శాఖ చైర్‌పర్సన్ ఆకుల లలిత తెలిపారు. నందిపేటలోని రైతువేదికలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో డివిజన్‌స్థాయి పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. పౌష్టికాహారంపై ఐసీడీఎస్ సీడీపీవో భార్గవి అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం నిర్వహించారు. ఆకుల లలిత మాట్లాడుతూ.. పౌష్టికాహారంతోనే ఆరోగ్యం లభిస్తుంన్నారు. ఎంపీపీ సంతోష్‌రెడ్డి, జెడ్పీటీసీ ఎర్రం యమున ముత్యం, సర్పంచ్ సాంబారు వాణి తిరుపతి, ఎంపీడీవో నాగవర్ధన్, తహసీల్దార్ ఆనంద్, డీడబ్ల్యూవో రసూల్‌బీ, జ్యోతి, సజనా తదితరులు పాల్గొన్నారు.



నందిపేటలో మహిళలతో ఆకుల లలిత

పోతంగల్(రుద్రూర్): పోతంగల్‌లో బుధవారం పోషన్ అభియాన్ మాసోత్సవాల్లో భాగంగా పోషకాహారంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. జెడ్పీటీసీ శంకర్‌పటేల్, సర్పంచ్ శంకర్, సీడీపీవో జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను పరిష్కరించాలి



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని పలు వార్డుల్లో ప్రజలు వివిధ సమస్యలతో సతమతం అవుతున్నారని, వెంటనే పరిష్కరించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాష్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా బుధవారం 13,14 వార్డుల్లో ఆయర పర్యటించి, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి గెలిపిస్తామని చెక్కి క్యాంప్ ప్రజలు మనస్ఫూర్తిగా చెబుతున్నారని వెల్లడించారు. నాయకులు బాలరాజు, వాసు, గంగాధర్, కృష్ణ, సందీప్, ప్రవీణ్, శివరాజ్ పాల్గొన్నారు.

బోధన్‌లో రక్తదాన శిబిరం

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఉమర్ ఫారూఖీ మజీద్ వద్ద మిలాద్ ఉన్-నబీ పండుగ సందర్భంగా మిలాద్ యూత్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ఏసీపీ కిరణ్‌కుమార్ ప్రారంభించారు. పలువురు యువకులు రక్తదానం చేశారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1	జవాన్ (తెలుగు) - 12.30 ; ఫుక్రేయ్ 3 - 3.55, 7.10, 10.25
స్క్రీన్-2	స్కంద - 11.00, 2.30, 6.00, 9.30
స్క్రీన్-3	స్కంద - 12.00, 3.30, 7.00
స్క్రీన్-4	చంద్రముఖి2 (తెలుగు)- 11.45, 3.05, 6.25, 9.45